
సాక్షి ఒడిశా

గురువారం । 10 । ఆగస్టు । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,75,771లు వచ్చాయని అధికారులు తెలిపారు.



ఏఎస్‌ఓ ఎంపిక ప్రక్రియపై స్టే

- 8లో



మణిపూర్ ఘటనపై కిసాన్‌సభ ధ్వజం

- 8లో

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన సాంస్కృతిక అధికారి



బాధ్యతలు స్వీకరిస్తున్న వినోద్‌కుమార్ బెహరా

బరంపురం: గంజాం జిల్లా సాంస్కృతికి అధికారిగా వినోద్‌కుమార్ బెహరా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక కార్యాలయంలో ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వినోద్ బెహరా గతంలో బరపురం మున్సిపాలిటీ కార్పొరేషన్(బీఎంసీ) డిప్యూటీ కమిషనర్ సేవలిందించారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్ట్

రాయగడ: యువతిపై అత్యాచారానికి పాల్పడిన కేసులో ఐదేళ్ల అనంతరం నిందితుడిని కల్యాణ సింగుపూర్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితుడు కల్యాణ సింగుపూర్ సమితి పట్టంగిపారోరో గ్రామానికి చెందిన కృష్ణ సికాక(32)గా గుర్తించామని రాయగడ ఎస్‌డీపీఓ రస్మిరంజన్ సేనాపతి తెలిపారు. 2018లో పర్శాలి గ్రామానికి చెందిన ఓ యువతిపై అత్యాచారం జరిగినట్లు కల్యాణ సింగుపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దీనిపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితుడు పరారవ్వడంతో అప్పటి నుంచి నిఘా వేసి, ఉంచారు. సుదీర్ఘ కాలం అనంతరం అతనిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు.

చెట్టుపై నుంచి జారిపడి బాలునికి గాయాలు



చికిత్స పొందుతున్న రోహన్

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి నారాయణపూర్ పంచాయతీ దులదులిగుడ గ్రామానికి చెందిన థబీర్ ప్రధాని కుమారుడు రోహన్(9) చెట్టుపై నుంచి జారిపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. బాలుడిని వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మంగళవారం సాయంత్రం తోటి స్నేహితులతో ఆడుతూ జామ చెట్టు ఎక్కి, కాయలు కోసేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో కాలు జారడంతో చెట్టుపై నుంచి కింద పడిపోయాడు. తీవ్ర గాయాల పాలవ్వడంతో తోటి స్నేహితులు విషయాన్ని కుటుంబీకులకు తెలియజేశారు. వెంటనే కల్యాణ సింగుపూర్ పీహెచ్‌సీకి తరలించగా, పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు.

ఒడిశా బార్ కౌన్సిల్‌కు రమేష్ పాత్రో



పిట్టా రమేష్ పాత్రో

జయపురం: రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికలో జయపురం బార్ కౌన్సిల్ సభ్యులు, బొయిపరిగుడకు చెందిన ప్రముఖ న్యాయవాది పిట్టా రమేష్ పాత్రో ఎన్నికయ్యారు. అవిభక్త కొరాపుట్ జిల్లాల నుంచి రాష్ట్ర అసోసియేషన్ సభ్యుడిగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు న్యాయవాదులు, ప్రముఖులు అభినందనలు తెలియజేశారు.

కొండచిలువ పట్టివేత



సర్పాన్ని బంధిస్తున్న హైల్ప్‌లైన్ సభ్యుడు మాధవ్

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి కేంద్రం హనుమాన్ మందిరం సమీపంలోని సుకువ బాల అనే వ్యక్తి ఇంటి పెరట్లో కొండచిలువ హల్‌చల్ చేసింది. దీంతో ఇంట్లోని వారంతో భయంతో కేకలు వేయగా, ఇరుగు-పొరుగు వారు చేరుకొని, చిత్రకొండ స్నేక్ హైల్ప్‌లైన్‌కు సమాచారం అందించారు. సభ్యుడు మాధవ్ అక్కడకు చేరుకొని.. 10అడుగుల పొడువు, 30కిలోల బరువైన కొండచిలువను బంధించారు. ఆహారం కోసమే అటవీ ప్రాంతం నుంచి ఇళ్ల పరిసరాల్లోకి వచ్చినట్లు తెలిపారు. సర్పాన్ని చిత్రకొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచి పెట్టారు.

పరిమళించిన కొండమల్లెలు

- ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- సంప్రదాయ వస్త్రధారణలో ఆకట్టుకున్న గిరిజనులు
- జిల్లా కేంద్రాల్లో అధికారులతో సహా భారీ ర్యాలీలు
- ప్రభుత్వ పథకాలు, హక్కులపై వివరించిన ప్రజాప్రతినిధులు



వివిధ ప్రాంతాల నుంచి హాజరైన ఆదివాసీలు



వేదికపై ఆదివాసీ నాయకులు



జిన్ను హికాక నృత్యం



చంగు భాజా వాయిస్తున్న గిరిధర్ గమాంగో

దప్పు వాయించిన గమాంగో

రాయగడ గోవిందచంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సావాల్లో భాగంగా సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ గిరిధర్ గమాంగో నేతృత్వంలో హిడెన్ టాలెంట్ బృందం ప్రదర్శించిన సంప్రదాయ సంగీత విభావరి ఆకట్టుకుంది. ఆదివాసీ దప్పు వాయిద్యంతో పాటు కర్ర చెక్కలు, ఇత్తడి వస్తువులనే వాయిద్య పరికరాలుగా వినియోగించి ఆయన ప్రదర్శించిన సంగీతం ప్రేక్షకులను ఉర్రూతలూగించింది. అనంతరం కొరాపుట్ జిల్లా బీజేడీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జిన్ను హికాక తదితరుల నృత్య ప్రదర్శన హుషారుగా సాగింది.

రాయగడ: ఆదివాసీ, భాషా, సంస్కృతి, కళలను పరిరక్షించడం అందరి బాధ్యతగా భావించాలని స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ) చైర్‌పర్సన్ అనసూయా మాఝి పిలుపునిచ్చారు. స్థానిక గోవింద చంద్ర దేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా ఆదివాసీ సమాజ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీల ఆర్థిక, సామాజిక రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా గత ఏడాది స్పెషల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎస్‌డీసీ)ని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ సంస్థ ద్వారా ఆదివాసీ ప్రాంతాల అభివృద్ధితో పాటు కళలు, సంస్కృతి పరిరక్షణ కోసం ప్రత్యేక నిధులు సమకూరుస్తుందన్నారు. జిల్లా ఆదివాసీ మహాసంఘం అధ్యక్షుడు అప్పలస్వామి కద్రక మాట్లాడుతూ ఆదివాసీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక హక్కులను కల్పిస్తున్నాయన్నారు. ఆగస్టు 9న ప్రపంచమంతా ఆదివాసీ దినోత్సవాన్ని పండుగలా జరుపుకొంటున్నారని తెలిపారు.

సంప్రదాయ ఊరేగింపు..



ఊరేగింపులో పాల్గొన్న అనసూయ మాఝి

ఆదివాసీ దినోత్సవంతో భాగంగా స్థానిక తుంబిగుడ, అంబాగుడ, చెక్కాగుడ, మజ్జిగౌరి మందిర ప్రాంతాల నుంచి వందలాది మంది ఆదివాసీలు తమ సంప్రదాయ కట్టుబట్టలు, నృత్యాలతో ఊరేగింపు నిర్వహించారు. కొత్త బస్టాండ్ కూడలిలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అక్కడి నుంచి గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానానికి చేరుకున్నారు. వేదికపై ఆదివాసీల సంప్రదాయ పద్ధతిలో పూజలు జరిపి, సభా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు రత్నమణి ఉలక, జిల్లా పరిషత్ సభ్యురాలు సంధ్యా పులక, సమితుల అధ్యక్షులు, ఆదివాసీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రాయగడ సమితి వైస్ చైర్మన్ హరప్రసాద్ హెప్రుక, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు గంగాధర్ పువ్వల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

మల్కన్‌గిరి జిల్లాలో..



మల్కన్‌గిరి: అంబేడ్కర్ కూడలి వద్ద గిరిజన నాయకులు

మల్కన్‌గిరి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బస్టాండ్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా సాగిన ఈ ప్రదర్శనలో జిల్లాలోని 32 తెగలకు చెందిన ఆదివాసీలు పాల్గొన్నారు. బోండా, కోయ, దిదాయి, పూర్జ, శాంతాలి, గదబ తదితరులు పాల్గొన్నారు. ఆదివాసీ దినోత్సవం నేపథ్యంలో రాష్ట్రపతి పేరిట రాసిన వినతిపత్రాన్ని కలెక్టర్ విశాల్‌సింగ్‌కు అందజేసేందుకు ప్రయత్నించగా, ఆయన దాదాపు 2గంటలకు పైగా స్పందించక పోవడంతో గిరిజన సంఘాల నాయకులు నిరసనకు దిగారు. అనంతరం కలెక్టర్ వచ్చి, వినతి స్వీకరించడంతో అంతా శాంతించారు. స్థానిక గిరిజనులు వ్యవసాయం, చింతపండు, టోల్ నూనె, మిహల్, పసుపు తదితర పంటలు విక్రయించి, జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వారికి ఉపాధి మార్గాలు కల్పించేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు సోను అనుగు, సంఘం నాయకులు పాల్గొన్నారు.



మల్కన్‌గిరి: మెయిన్ రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజనులు



పర్లాకిమిడి: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆదివాసీలు, అధికారులు

హక్కులు అమలు కావడం లేదు..

పర్లాకిమిడి: భారత రాజ్యాంగంలో ఆదివాసీలకు నివసించే హక్కులు, అటవీ పట్టాలు ఇవ్వాలని ఉన్నా అవి సక్రమంగా అమలు కావడం లేదని మాజీ ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ నేత గిరిధర గమాంగో ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రం ఫారెస్ట్ గేటు సమీపంలోని ఆదివాసీ మైదానంలో జరిగిన గిరిజన దినోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇందులో రాష్ట్ర మాజీమంత్రి హలధర కార్జి, కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గమాంగో తన గిరిజన సంప్రదాయ చంగు, డప్పును వాయించి, ఆనంద పరిచారు. అంతకుముందు పర్లాకిమిడి కొత్త బస్టాండ్ నుంచి జిల్లా ఆదివాసీ మహాసంఘ్ నేతృత్వంలో భారీ ర్యాలీ జరిగింది. ఇందులో మొహానా ఎమ్మెల్యే దాశరథి గమాంగో, ఎస్డీసీ చైర్‌పర్సన్ మరియం రైతో, గుమ్మా సమితి చైర్‌పర్సన్ సునేమీ మండల్, రాయఘడ సమితి చైర్మన్ పూర్ణబాసి నాయక్, విశ్రాంత ఓఏఎస్ అధికారి పవిత్ర మండల్, అశోక్ కుమార్ భుయ్యాన్, సుధాంచరణ్ మండల్, పల్లబ్ లిమ్మా తదితరులు పాల్గొన్నారు. అనంతరం మార్కెట్ మీదుగా హైస్కూల్ జంక్షన్ వద్దకు చేరుకొని, బిజూ పట్నాయక్ విగ్రహానికి నివాళులర్పించారు.



పర్లాకిమిడి: మాజీ సీఎం గిరిధర్ గమాంగోకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆదివాసీ మహిళ



పర్లాకిమిడి: సభకు విచ్చేసిన ఆదివాసీ నాయకులు

ఆదివాసీ భాషలో 'ధోక' చలనచిత్రం



చిత్ర నిర్మాణ కార్యక్రమంలో చైర్‌పర్సన్ మహంతి

జయపురం: కొరాపుటియ భాషలో 'ధోక' చలనచిత్ర నిర్మాణానికి జయపురం కళాకారులు శ్రీకారం చుట్టారు. స్థానిక బంకమఠం ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి చలన చిత్రాలు తీయడం వల్ల జిల్లాకు చెందిన స్థానిక కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశాలు లభిస్తాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కథా రచయిత, ఫొటోగ్రాఫర్ మహ్మద్ బాబుల్ మాట్లాడుతూ దాదాపు రెండున్నర గంటల నిడివి గల ఈ చిత్రం కుటుంబ జీవనం ఇతివృత్తంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. దర్శకునిగా అనంతరాజ్, నటులుగా కైలాష్‌నాగ్, సిద్ధి పాత్రో, పద్మినీ బెహరా, సూరజకుమార్, సిద్ధి పాత్రో, నరేష్‌కుమార్ రౌత్, రింకు, సుఖదేవ్ బారిక్ సంగీతాన్ని సమకూర్చుతారని వివరించారు.

అమర వీరులకు నివాళి

క్రాంతి దివస్ పురస్కరించుకుని రాష్ట్ర గవర్నర్ ప్రొఫెసర్ గణేషీ లాల్ అమర వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భువనేశ్వర్ లోనిఅమరవీరుల స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, శ్రద్ధాంజలి ఘటించారు. వారి త్యాగాలను దేశం మురువదని కొనియాడారు.

– భువనేశ్వర్



విదేశీ మద్యంతో వ్యక్తి అరెస్ట్



మద్యంతో పట్టుబడిన నిందితుడు

మల్కన్‌గిరి: జిల్లాలోని ఖొయిర్‌పుట్ సమితి ద్వార్‌గూడ గ్రామంలో ఔట్‌పోస్టు ఎస్‌ఐ అజిత్‌సింగ్ బిహారీ, సిబ్బంది బుధవారం పెట్రోలింగ్ నిర్వహించారు. అదే సమయంలో బైక్‌పై బ్యాగుతో వెళ్తున్న వ్యక్తిని తనిఖీ చేయగా, 16 విదేశీ మద్యం బాటాళ్లను గుర్తించారు. ఈ మేరకు బీహార్ రాష్ట్రానికి చెందిన నరేంద్ర యాదవ్(45)ను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు.

ఓస్టా శిక్షకుల నిరసన



అదనపు డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు ఒడిశా మాధ్యమిక స్కూల్ శిక్షక సంఘం(ఓస్టా) బెత్తగుడ వద్ద జిల్లా ముఖ్య శిక్షాధికారి కార్యాలయం ఎదుట బుధవారం నిరసన ధర్నా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు బి.తిరుమలరావు మాట్లాడుతూ జిల్లాలోని 195 పాఠశాలల్లో మాధ్యమిక ఉపాధ్యాయులకు జీతాలు, బకాయి నిధులు మంజూరు, నూతన పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓస్టా జిల్లా కార్యదర్శి ప్రఫుల్లకుమార్ ప్రధాన్, అదనపు డీఈఓకు వినతిపత్రం అందించారు.

ఓటర్ల జాబితాలో నమోదుకు ఆదేశాలు

- విద్యార్థులను చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్
- యూనివర్సిటీ, కళాశాలల నుంచి వివరాల సేకరణ



భువనేశ్వర్: ఓటు హక్కు పొందేందుకు అర్హత సాధించిన విద్యార్థులను ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలలకు ఉన్నత విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల ప్రక్రియలో యువ ఓటర్ల భాగస్వామ్యాన్ని సులభతరం చేయడం ఈ ప్రక్రియ లక్ష్యంగా ఉత్తర్వులు పేర్కొన్నాయి. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి విద్యార్థుల వివరాలను ఓటరు జాబితాలో జోడిస్తారు. విశ్వవిద్యాలయాల రిజిస్ట్రార్లు, కళాశాలల ప్రిన్సిపాళ్లు దీనిని ప్రత్యక్షంగా పర్యవేక్షించాలని ఉన్నత విద్యాశాఖ వెల్లడించింది. ప్రధానంగా విద్యాసంస్థల్లో కొత్తగా చేరి, ఓటు హక్కు యోగ్యత కలిగినా జాబితాలో పేర్లు నమోదు కాని వివరాలు సేకరించి, తదనుగుణంగా చర్యలు చేపట్టాలని వివరించారు. ఈ ప్రక్రియ మార్గదర్శకాలు ప్రభుత్వేతర, ప్రైవేటు విద్యా సంస్థలకు వర్తిస్తుందని స్పష్టంచేశారు. యువ ఓటర్లు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో) రాసిన లేఖ పట్ల స్పందించిన ఉన్నత విద్యాశాఖ ఈ మేరకు చర్యలు చేపడుతోంది. ఇతర వర్గాల ఓటర్లతో పోలిస్తే రాష్ట్రంలో యువ ఓటర్ల నమోదు సంతృప్తికరంగా లేదని ఎన్నికల కమిషన్ అసంతృప్తి వ్యక్తంచేసింది. యువ తరానికి ప్రజాస్వామ్యంలో ఓటరు ప్రాధాన్యత, ఓటు హక్కు విలువపట్ల అవగాహన కల్పించి, దేశ నిర్మాణ ప్రక్రియలో భాగస్వాములయ్యే రీతిలో విద్యార్థి వర్గాన్ని చైతన్య పరచాల్సి ఉందని ఎన్నికల కమిషన్ అభిప్రాయం వ్యక్తంచేసింది.

ఏటా నాలుగే తేదీల్లో..

ఓటరు నమోదు కోసం కొత్త తేదీల గురించి తెలియజేస్తూ, ప్రజా ప్రతినిధి చట్టం–1950 తాజా సవరణ ప్రకారం, ఏటా జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీల్లో అర్హులైన ఓటర్లని నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు యోగ్యులుగా పరిగణించి, నమోదు చేయడం అనివార్యంగా కమిషన్ పేర్కొంది. కళాశాలలు, విశ్వ విద్యాలయాల్లో కొత్త అభ్యర్థుల అడ్మిషన్ ప్రక్రియ తర్వాత అర్హులైన ఓటర్ల నమోదుకు చర్యలు తీసుకోవాలని ఉన్నత విద్యాసంస్థలను ఆదేశించాలని సీఈవో అభ్యర్థించారు. విద్యార్థులు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్(వీహెచ్ఏ) ద్వారా ఓటరు జాబితాలో నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. విశ్వవిద్యాలయం, కళాశాలల్లో ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు(ఈఎల్‌సీ) కార్యకలాపాల్లో పాల్గొని అనుబంధ అవగాహన సమకూర్చుకోవాలని కమిషన్ వివరించింది.

క్లుప్తంగా

సెప్టెంబర్ నుంచి గిరిజన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు



రోగితో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశరావు

పొందూరు: గిరిజన ప్రాంతాల్లో సెప్టెంబర్ నెల నుంచి వైద్య శిబిరాలు పునఃప్రారంభంకానున్నాయని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ పాగిరి ప్రకాశరావు తెలిపారు. పొందూరులోని అభయ ఆస్పత్రిని బుధవారం సందర్శించిన ఆయన ఆరోగ్యశ్రీ విభాగంలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వైద్య సేవలు ఎలా అందుతున్నాయో తెలుసుకున్నారు. గర్భిణులు, అత్యవసర సేవలు అవసరమైనవారికి పలు సూచనలు చేశారు. గర్భం దాల్చినట్టు నిర్ధారణ అయిన వెంటనే ఆరోగ్యశ్రీ కార్డుతో వైద్యసేవలను ప్రారంభించుకోవాలని సూచించారు. ఆరు, ఎనిమిది, డెలివరీ ముందు తీసే స్కానింగ్‌లు పూర్తిగా ఉచితమని చెప్పారు. డెలివరీకి ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. అత్యవసర సేవలు అందాల్సిన కేసులు విషయంలో ఆరోగ్యశ్రీ కార్డు అందుబాటులో లేకపోతే ముందుగా టెలీఫోనిక్ ఇంటిమేషన్ సౌకర్యం ఉందని, 72 గంటల తర్వాత ఆరోగ్యశ్రీ కార్డును ఆస్పత్రులకు అందించవచ్చునన్నారు. ఆయనతో పాటు డాక్టర్ నరేష్, ఆరోగ్యశ్రీ సిబ్బంది ఉన్నారు.

'స్వాతంత్య్ర' పోటీలకు 170 మంది ఎంపిక

ఎచ్చెర్ల క్యాంపస్: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉన్నత పాఠశాలల విద్యార్థులకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న వివిధ పోటీలకు 170 మందిని ఎంపిక చేసినట్లు రిజిస్ట్రార్ సి.హెచ్.ఎ.రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. ఎంపికైన వారికి గురువారం వక్తృత్వ, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. వర్సిటీ, డిగ్రీ కళాశాలల బోధన సిబ్బంది న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. పోటీలకు హాజరయ్యే విద్యార్థుల కోసం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రోడ్డు నుంచి బస్సు సౌకర్యం కల్పించినట్టు చెప్పారు. ఉదయం తొమ్మిది నుంచి పది గంటల వరకు బస్సు అందుబాటులో ఉంటుందన్నారు. ఫైనల్ రౌండ్ విజేతలకు 15వ తేదీన స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ప్రజాసంఘాల ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని ప్రజా సంఘాల నాయకులు కోరారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆల్ ట్రేడ్ యూనియన్లు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు కలెక్టరేట్ వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలన్నారు. తొమ్మిదేళ్ల మోదీ పాలనలో కార్మిక సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర గ్యారంటీ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ పరిపాలన అధికారి బి.రాజేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు, కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాశ్, రైతు సంఘం నాయకుడు బలగ శ్రీరామమూర్తి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి డి.గణేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చిక్కాల గోవిందరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షుడు వెలమల రమణ, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.పార్వతీశం, బి.జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

బాలలను పనిలో పెట్టవద్దు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: బాలలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) ఎస్సై కేశవరావు అన్నారు. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో సురవరపు ఈశ్వరరావు బైక్ పార్కింగ్ నడుపుతున్నాడు. ఇక్కడ ఓ బాలుడిని పనిలో పెట్టుకున్నట్టు తెలుసుకున్న పోలీసులు బుధవారం అక్కడకు వెళ్లి కౌన్సెలింగ్ చేశారు. బాలుడి తల్లిదండ్రులను పిలిపించి మాట్లాడారు. సీడబ్ల్యూసీ వారి వద్ద హాజరు పరిచారు. ఎస్సై మాట్లాడుతూ.. 18 ఏళ్లలోపు వారిని పనుల్లో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. దిశ మహిళ కానిస్టేబుల్ పాల్గొన్నారు.

ఏఎస్ఓ ఎంపిక ప్రక్రియపై స్టే

- ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషన్‌ను ఆదేశించిన హైకోర్టు
- మెరిట్ జాబితా రూపొందించడంపై యథాతథ ఆదేశాలు



రాష్ట్ర హైకోర్టు

భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషన్(ఓపీఎస్సీ) ఆధ్వర్యంలో జరిగిన అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ల(ఏఎస్ఓ) నియామక ప్రక్రియను రాష్ట్ర హైకోర్టు తాత్కాలికంగా నిలిపినట్లు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసు తదుపరి విచారణ ఈనెల ఈనెల 21కి వాయిదా వేసినట్లు హైకోర్టు ప్రకటించింది. ఒడిశా సెక్రటేరియట్ సర్వీస్‌లోని గ్రూప్-బీ పోస్టుల్లో 796 ఏఎస్ఓల భర్తీ కోసం తాజా మెరిట్ జాబితాను 6 వారాల్లోగా ప్రచురించాలని ఒడిశా పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఓపీఎస్సీ)ని హైకోర్టు ఆదేశించిన 4రోజుల స్వల్ప వ్యవధిలో స్టే ఉత్తర్వులు జారీ కావడం విశేషం. ఓపీఎస్సీ రూపొందించిన మెరిట్ జాబితాను రద్దు చేస్తూ మే 19న జారీ చేసిన ఉత్తర్వులను సమీక్షించి, రీకాల్ చేయాలంటూ దాఖలైన రెండు పిటిషన్లను గతంలో హైకోర్టు తిరస్కరించింది.

న్యాయస్థానానికి చేరడంతో..

ఓపీఎస్సీ రాత పరీక్షను 2022 ఆగస్టు 27న నిర్వహించింది. రాష్ట్రంలో 1,48,888మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరి నుంచి 1,104మందిని ధ్రువపత్రాల పరిశీలన, సామర్థ్య పరీక్షకు ఎంపిక చేస్తూ మెరిట్ జాబితాను గత నవంబర్ 7న వెల్లడించింది. 796 ఖాళీల భర్తీ కోసం దాదాపు 2/3 ప్రాతిపదికన అభ్యర్థులను ఎంపిక చేసి, తుది నియామకం కోసం నిర్వహించే పరీక్షలకు పిలుపునిచ్చింది. ఈ దశలో వివాదం కోర్టు ముందుకు ఎక్కింది. ఓపీఎస్సీ వెల్లడించిన జాబితాలో చోటు చేసుకోని రజత్‌కుమార్ మిశ్రాతో నలుగురు అసంతృప్తి అభ్యర్థులు రాత పరీక్ష మెరిట్ జాబితా రూపకల్పనలో అవకతవకలు చోటు చేసుకున్నాయని సవాల్ చేశారు. ఏఎస్ఓ పదవుల నియామకానికి నిర్వహించిన రాత పరీక్షలో సబ్జెక్టు వారీగా కటాఫ్ మార్కులను ప్రవేశ పెట్టడాన్ని ఈ అభ్యర్థులు తప్పిదంగా పేర్కొని సవాల్ చేసి, రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. రాత పరీక్ష ముగిసిన తరువాత సబ్జెక్టుల వారీగా కనీస అర్హత మార్కును నిర్ణయించే అధికారం ఓపీఎస్సీకి లేదని హైకోర్టు గతంలో తీర్పునిచ్చింది. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన మేరకు నిబంధనలను ధ్రువీకరించకుండా ఓపీఎస్సీ యాంత్రికంగా వ్యవహరించినట్లు న్యాయస్థానం అభిప్రాయం వ్యక్తం చేసింది.

హోంగార్డు అనుమానాస్పద మృతి

- పోస్టుమార్టం చేయకుండానే అంత్యక్రియలు నిర్వహించిన కుటుంబీకులు
- ఎస్పీ ఆదేశాలతో మృతదేహాన్ని బయటకు తీసిన పోలీసులు



అవినాష్ లిమ్మ మృతదేహం



పూడ్చిపెట్టిన మృతదేహాన్ని బయటకు తీస్తున్న పోలీసులు

రాయగడ: హోంగార్డు అనుమానాస్పద మృతి ఘటనలో జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ ఆదేశాల మేరకు ఖననం చేసిన మృతదేహాన్ని బయటకు తీసిన మరోసారి పోస్టుమార్టం నిర్వహించారు. జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పుటాసింగి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ ఘటన హాట్ టాపిక్‌గా మారింది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. పుటాసింగి పోలీస్ స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న అవినాష్ లిమ్మ(33) సోమవారం రాత్రి అనుమానాస్పద రీతిలో పుటాసింగిలోని ఓ మండపంపై శవమై కనిపించాడు. మంగళవారం ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్తులు గమనించి, పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై పోలీసు శాఖ నుంచి సరైన స్పందన లేకపోవడంతో మతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లిన లిమ్మ కుటుంబీకులు క్రైస్తవ సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు. విషయం జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ దృష్టికి వెళ్లడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం చేయకుండా ఎలా అప్పగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృతికి గల పూర్తి కారణాలను విశ్లేషించాలని ఆదేశించారు. దీంతో హుటాహుటిని గ్రామానికి చేరుకున్న సిబ్బంది.. పూడ్చి పెట్టి ఉన్న మృతదేహాన్ని బయటకు తీసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో లిమ్మ కుటుంబీకులు, గ్రామస్తులు దీనిపై వ్యతిరేక వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం పోలీసులు వారికి నచ్చజెప్పి, మృతదేహాన్ని వెలుపలికి తీశారు. అనంతరం గుణుపూర్ సబ్ డివిజన్ ఆస్పత్రికి తరలించి, భద్రపరిచారు. బుధవారం ఉదయం పోస్టుమార్టం చేయనున్నారు. అయితే ఇది హత్య? లేక సహజ మరణమా అనే వివరాలు పోస్టుమార్టం రిపోర్టులో తెలుస్తుందని పోలీసులు తెలిపారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించారు.

నిధులు సక్రమంగా వినియోగించాలి

- కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్



కెరండీ స్వాస్థ్య కేంద్రం అధికారికి కాయకల్ప అవార్డును అందిస్తున్న సీడీఎంఓ



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్, జెడ్పీ చైర్మన్

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని ముఖ్య వైద్యాధికారి కార్యాలయంలో జిల్లా స్వాస్థ్య సమితి సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. కలెక్టర్ స్మృతిరంజన్ ప్రధాన్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగగా, ముఖ్య అతిథిగా జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతిరావు, సీడీఎంఓ డాక్టర్ ప్రదీప్‌కుమార్ పాత్రో, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వాహణాధికారి గుణనిధి నాయక్, జాతీయ స్వాస్థ్య మిషన్ మేనేజర్ సౌమ్య రాణి గౌడా తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో రోగి కల్యాణ సమితి పథకం ద్వారా అందుతున్న నిధులు ఖర్చు, సామగ్రి, జాతీయ స్వాస్థ్య మిషన్, రాష్ట్ర నిధుల వినియోగింపై సమీక్షించారు. జిల్లాలో 50పడకల మెటర్నిటీ ఆస్పత్రి, ఇతర సౌకర్యాలు రోగులకు అందేలా నిర్మాణాలు చేపట్టాలని సీడీఎంఓ డాక్టర్ పీకే పాత్రోను ఆదేశించారు. సమావేశానికి 7మండల కేంద్రాల నుంచి 85మందికి కాయకల్ప అవార్డులలకు ఆమోదం తెలిపారు. వీటిలో గుసాని సమితి లావణ్యగడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, కెరండీ స్వాస్థ్య సేవా కేంద్రానికి ప్రథమ బహుమతి లభించగా, ఛెలిగడ టుమాన్ స్వాస్థ్య కేంద్రానికి కూడా పురస్కారాలు అందజేశారు. సమావేశంలో డాక్టర్ ఎంఎ అలీ, జిల్లా అదనపు చికిత్సాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

చింతాలిగుడలో నేత్ర వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రాయగడ: పట్టణానికి చెందిన మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చింతాలిగుడ మురికివాడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. పట్టణానికి సమీపంలోని పితామహల్‌లో ఉన్న ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇనిస్టిట్యూట్ సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో 120మంది రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. స్థానిక వాణిజ్య పన్నులశాఖ(జీఎస్‌టీ) జాయింట్ కమిషనర్ అవినాష్ చౌధరి హాజరై, శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందించాల్సిన విషయమన్నారు. క్లబ్ అధ్యక్షురాలు కె.శోభారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు, రాయగడ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సల్వరాజు తదితర ప్రముఖులు హాజరయ్యారు.

ఆత్మస్థైర్యంతోనే విజయం

- స్పీకర్ తమ్మినేని సీతారాం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్తే విజయం సాధించగలరని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ఆమదాలవలసలోని మార్కెట్ యార్డు ఆవరణలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అలిమ్‌కో సంస్థ సహకారంతో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ ఉపకరణముల కోసం గుర్తింపు శిబిరాన్ని బుధవారం నిర్వహించగా.. దీన్ని స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు ఎవరికన్నా తక్కువ కాదని, అన్ని రంగాల్లో విజయం సాధిస్తున్నారని గుర్తు చేశారు. ప్రభుత్వం దివ్యాంగుల కోసం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. వాటిపై అవగాహన కల్పించుకుని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలు కాని పథకాలను వయోవృద్ధులు, దివ్యాంగుల కోసం రాష్ట్రంలో అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఏదైనా పని నిమిత్తం దివ్యాంగులు వెళితే వారికే మొదటిగా అవకాశం కల్పించాలని, వారి సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సీఎం ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. ఆమదాలవలస, ఎచ్చెర్ల నియోజకవర్గంలో గల దివ్యాంగులు, వయోవృద్ధులు ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకుంటే వారికి త్వరలోనే అందజేయడం జరుగుతుందన్నారు. భారత ప్రభుత్వం ద్వారా గుర్తింపు పొందిన కృత్రియ అవయవాల తయారీ కేంద్రం అలిమ్‌కో సహకారంతో ఈ ఉపకరణాలను ఉచితంగా సరఫరా చేయడం జరుగుతుందన్నారు. గుర్తింపు శిబిరంలో భాగంగా శారీరక వైకల్యం, దృష్టిలోపం, బధిరులు, వయోవృద్ధులకు సహాయ ఉపకరణాలను త్వరలోనే నియోజకవర్గాల వారీగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఏడీ కవిత, ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు, లావేరు ఎంపీడీవో సురేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై కిసాన్‌సభ ధ్వజం

- పర్సంబలో అఖిల భారత కిసాన్ మజ్దూర్ సభ ర్యాలీ



పర్సంబలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు



ఆదివాసీ మహాసభకు విచ్చేసిన గిరిజనులు

పర్లాకిమిడి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గజపతి జిల్లా గుమ్మా బ్లాక్ పర్సంబ గ్రామంలో అఖిలభారత్ కిసాన్ మజ్దూర్ సభ, అఖిల భారత ఆదివాసీ మంచ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, నిరసన సభ చేపట్టారు. ఆదివాసీ నాయకుడు కడుకా శబోరో అధ్యక్షతన ప్రారంభమైన ఈ ర్యాలీలో బీకేఎంఎస్ జాతీయ కార్యదర్శి బాలచంద్ర షడంగి పాల్గొని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఎండగట్టారు. మణిపూర్ ఘటనలో ఆదివాసీ యువతిని వివస్త్ర చేసి రోడ్డుపై ఊరేగించడం, మధ్యప్రదేశ్‌లో ఆదివాసీ యువకుడిపై బీజేపీ నాయకుడు మూత్రం పోయడం వంటి హేయమైన చర్యలను ఖండించారు. కేంద్రప్రభుత్వం జంగల్ సురక్షా బిల్‌పై సంతకాలు చేయడం కారణంగా సమీప భవిష్యత్‌లో ఒడిశాలో అడవులు అంతరించ పోవడమే కాకుండా ఆదివాసీలు, జీవజాతులు నశించిపోతాయని అభిప్రాయం వ్యక్తంచేశారు. కేంద్రం ఉమ్మడి పౌరస్మృతి బిల్లు అమలు చేస్తే ఆదివాసీ సంప్రదాయలు నశించిపోయే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ కార్యదర్శి కేదార్ శబోరో, సభ్యులు కడుకా, సంబుర, నారీనేత్రి గణశ్రీ, శాంసన్ గమంగొ తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్య్ర మహోత్సవంలో భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్



ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్, ఎస్పీ రాధిక తదితరులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్వాతంత్య్రం కోసం అసువులు బాసిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశ ఔన్నత్యాన్ని దశదిశలా చాటి చెప్పేందుకు స్వాతంత్య్ర మహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్ ప్రజలకు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీ స్మృతి వనంలో మేరా మట్..మేరా దేశ్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా మేరా మిట్టీ.. మేరా దేశ్ కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ముగింపు కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రతిజ్ఞ, అమరవీరులకు వందనం, ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటే వసుధా వందనం, భారత ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశంతో కూడిన శిలాఫలకాల ఆవిష్కరణ, అమరవీరులను గుర్తించడం వంటి ఐదు రకాల కార్యక్రమాలను ఈ నెల 15వ తేదీ వరకు జిల్లాలోని 912 గ్రామ పంచాయతీలతో పాటు 75 వార్డుల్లో నిర్వహిస్తామన్నారు. 15వ తేదీ తరువాత ప్రతి గ్రామ, మండల, శాసనసభ నియోజకవర్గం నుంచి కొంత మట్టిని సేకరించి ఢిల్లీకి పంపించనున్నట్టు వివరించారు. అక్కడ కూడా ప్రత్యేక కార్యక్రమం జరుగుతోందన్నారు. జిల్లాలోని వద్దులు, పెద్దలు, పిల్లలు అందరూ వారి స్థాయిలో స్వాతంత్య్ర మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ జి.ఆర్.రాధిక మాట్లాడుతూ.. స్వాతంత్య్ర మహోత్సవ వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు. పోలీస్ అమర వీరులను స్మరించుకోవడం, వారి కుటుంబాలను సన్మానించనున్నట్టు పేర్కొన్నారు. ప్రతి పంచాయతీలో 75 మొక్కలు నాటే కార్యక్రమంలో భాగంగా పోలీస్ శిక్షణ కళాశాలలో మొక్కలు నాటడం జరిగిందనిన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం అమరులైన త్యాగమూర్తులను స్మరించుకోవడంతో పాటు మన దేశ ఔన్నత్యాన్ని, కీర్తి ప్రతిష్టలను మున్ముందుకు తీసుకువెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, మెప్మా పీడీ కిరణ్, జెడ్పీ సీఈవో వెంకట్రామన్, డ్వామా పీడీ చిట్టి రాజు, ఆయుష్ డాక్టర్ జగన్నాథం, సెట్‌శ్రీ సీఈవో ప్రసాదరావు, ఎన్‌వైకే కోఆర్డినేటర్ ఉజ్వల, గాంధీ మందిర్ కమిటీ ప్రతినిధులు ఎం.ప్రసాదరావు, జోగునాయుడు, కె.వేణుగోపాల్, ఎం.వి.ఎ స్.ఎస్.శాస్త్రి, వి.జగన్నాథనాయుడు, నక్క శంకరరావు, కొంక్యాన మురళీధర్, గుర్తు చిన్నారావు, దేవభూషణరావు, నటుకుల మోహన్, పొన్నాడ రవి, హారిక ప్రసాద్, పందిరి అప్పారావు, ఎం.అనంత భట్లు, ఆర్మీ కాలింగ్ ప్రతినిధులు రమణ, కిరణ్ పాల్గొన్నారు.

సీఎంతోనే గిరిపుత్రుల సంక్షేమం

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: గిరిపుత్రుల సంక్షేమానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే గిరిజనుల సంక్షేమం సాధ్యమని చెప్పారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని మందసలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం హయాంలో గిరిజనాభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన కుమారుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గిరిజనులకు ఎంతో న్యాయం చేశారన్నారు. 50 ఏళ్లకే పింఛన్లు, పోడుభూముల పట్టాలు అందించారన్నారు. గిరిజనుల ముద్దుబిడ్డ అల్లూరి సీతారామరాజు పేరిట జిల్లాను కూడా ఏర్పాటు చేశారన్నారు. గిరిజనులకు సంపూర్ణ ఆరోగ్యం చేకూర్చడానికి రాష్ట్రంలో రెండు మెడికల్ కళాశాలలు ఏర్పాటు, సీతంపేటలో సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మిస్తున్నామన్నారు. గిరిబిడ్డలను విద్యావంతులుగా మార్చడానికి పలు పథకాలను అమలు చేస్తున్నామని చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసి, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి గిరిజన ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.

గౌతు కుటుంబం.. ఓట్ల రాజకీయం..

గిరిజనులను గౌతు కుటుంబం ఓటు బ్యాంకుగానే మలుచుకుందని, వారికి అభివృద్ధి అంటే ఏమిటో తెలియనివ్వకుండా చేసిందని మంత్రి అప్పలరాజు ఆరోపించారు. మందస మండలంలోని కొయిటా సాయి అనే గిరిజన గ్రామంలో ఓట్లు దండుకున్న గౌతు కుటుంబీకులు కనీసం ఆ ప్రాంత గిరిజనులను పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మాత్రమే రహదారులు నిర్మించడం జరిగిందన్నారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటిస్తుంటే.. చేయూత నిధులతో గిరిజనులు అభివృద్ధి చెందుతున్న పరిస్థితులు ఎంతో స్పష్టంగా కనిపిస్తున్నాయన్నారు. గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జేఏసీ నాయకుడు సవర నీలకంఠం, ఎంపీపీ డొక్కరి దానయ్య, జెడ్పీటీసీ సభ్యుడు సవర కుమారి, ఆదివాసీ వికాస పరిషత్ నాయకులు సవర చంద్రరావు, ఎస్.డొంబురు, ఎస్.సీతారాం, బాలకృష్ణ, కామయ్య, గిరిజన సంఘం అధ్యక్షుడు సవర ధర్మారావు, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సవర హరికృష్ణ, గిరిజన సర్పంచ్‌లు సవర రోజా, సవర నవిత, సవర సుధాకర్, మజ్జి కుమార్‌చంద్ర, సవర సంధ్య, సవర లక్ష్మీప్రియ, ఎంపీటీసీ సభ్యులు సవర హరినారాయణ, సవర ఢిల్లేశ్వరి, సవర కాంచన, అధికారులు పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్: భారతదేశమంతటా ఒకే సమయంలో ఆనందమైన జీవితానికి ఆనందోత్సవం కార్యక్రమంలో భాగంగా పెద్దపాడు రోడ్డులోని ఆర్ట్ ఆఫ్ లివింగ్ కేంద్రంలో ప్రత్యేక యోగా తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ సెంటర్ సీనియర్ టీచర్, జిల్లా ప్రతినిధి డాక్టర్ కె.అమ్మన్నాయుడు వీటిని ప్రారంభించారు. ఆరు రోజులు శిక్షణ తరగతులుంటాయన్నారు. శిక్షణలో శ్వాస ప్రక్రియ, సుదర్శన క్రియ నేర్పిస్తున్నట్టు పేర్కొన్నారు. ఉదయం, సాయంత్రం రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో 35 మంది పాల్గొన్నారని ఏవోఎల్ టీచర్ దేసూళ సురేంద్ర చెప్పారు. చివరి రోజున ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవిశంకర్ గురూజీ ప్రత్యక్ష ప్రసారం ఉంటుందన్నారు.

జర్నలిజం సమాజానికి ఉపయోగపడాలి



సంపాదకుల గ్యాలరీని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ శర్మ

ఎచ్చెర్ల క్యాంపస్:

జర్నలిజం సమాజానికి ఉపయోగపడాలని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగాన్ని బుధవారం సందర్శించారు. సంపాదకీయుల గ్యాలరీ పరిశీలించిన అనంతరం విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా జర్నలిస్టులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. భాష, సాహిత్యంపై పట్టు సాధించాలన్నారు. జర్నలిజం సహాయ ఆచార్యులు రెడ్డి తిరుపతిరావు, గుంట లీలావరప్రసాద్ ఉన్నారు.

క్లుప్తంగా

ఎరువుల అక్రమ నిల్వ పట్టివేత



లక్ష్మీపురంలో ఎరువుల నిల్వలు పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

జామి: అక్రమంగా దాచి ఉంచిన ఎరువుల నిలవ్వలను విజిలెన్స్, వ్యవసాయశాఖ సిబ్బంది బుధవారం పట్టుకున్నారు. జామి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వెంకటరావు కిరాణా జనరల్స్‌లో ఎరువులను అక్రమంగా విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేర కు విజిలెన్స్ సీఐ బి.సింహాచలం, ఏఓ కిరణ్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో సుమారు రూ.42,000 విలువ కలిగిన గ్రోమోర్, డీఏపీ, యూరియా నిల్వలను గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లైసెన్స్ ఉన్న డీలర్లు మాత్రమే ఎరువుల క్రయవిక్రయాలు జరపాలని స్పష్టం చేశారు. అక్రమంగా ఎరువుల అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సంప్‌లో పడి తల్లీపిల్లల మృతి



మృతి చెందిన భార్యాపిల్లలతో భర్త లక్ష్మణరావు(ఫైల్)

బొబ్బిలి: విశాఖ పట్నంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న గొల్లపల్లి సంధ్య, ఆమె ఇద్దరు పిల్లలు గౌతమ్,అలేఖ్యలతో సంప్‌లో పడి మృతి చెందారు. ఈ వార్త తెలుసుకున్న బంధువులు, బొబ్బిలి వాసులు కన్నీటి పర్యంతమయ్యారు. పది నెలల క్రితం తాపీమేస్త్రీ అయిన భర్త లక్ష్మణరావుతో కలిసి పిల్లలను తీసుకుని విశాఖ వెళ్లిన సంధ్య ఇంతలోనే ఇలా అయిందా? అని ఆవేదన చెందారు. అసలు సమస్య ఏమొచ్చిందన్న విషయమై ఆరా తీసే ప్రయత్నం చేశారు. కూరాకుల సామాజిక వర్గానికి చెందిన వారికి ఆర్థిక ఇబ్బందులు లేకపోయినా అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేయడానికి వెళ్లారు. అక్టోబర్ వస్తే వీరు అక్కడికి వెళ్లి సంవత్సరం అవుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ మరణానికి కుటుంబ సమస్యలా? మరే ఇతర సమస్యలా? అన్న విషయమై తెలుసుకునేందుకు ఇక్కడి నుంచి వారి బంధువులు, కుటుంబసభ్యులు తరలి వెళ్లారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు చోడిగంజి రమేష్ నాయుడు అక్కడి నుంచి మృతదేహాలను తీసుకువచ్చేందుకు వెళ్లారు. బొండపల్లి మండలం దేవుపల్లికి చెందిన సంధ్యతో లక్ష్మణరావుకు పదేళ్ల కిందట వివాహమైనట్టు స్థానికులు చెబుతున్నారు.

గంజాయి కేసులో ముద్దాయిలకు పదేళ్ల జైలు

విజయనగరం క్రైమ్: గంజాయి కేసులో నలుగురు ముద్దాయిలకు పదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ విజయనగరం ఒకటవ ఏడీజే జడ్జి జి.రజని తీర్పు వెల్లడించారు. ఈ మేరకు ఎస్పీ ఎం.దీపిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తవలస పోలీస్‌స్టేషన్ పరిధిలో సంతపేట వద్ద హర్యానా రాష్ట్రానికి చెందిన కొందరు వ్యక్తులు గుడారాలు వేసుకుని ఉండగా, 2016 నవంబరు 9న కొత్తవలస పోలీసులకు అందిన సమాచారంతో గుడారాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హర్యానా రాష్ట్రం పానిపట్ జిల్లా స్మల్కా ప్రాంతానికి చెందిన సూరజ్ మాల్ (ఎ1), సూర్య (ఎ2), సురేష్ (ఎ3), కలియా (ఎ4)ల నుంచి 244 కిలోల గంజాయిని అప్పటి కొత్తవలస సీఐ జి.సంజీవరావు స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించి, కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. కోర్టు విచారణలో ముద్దాయిలపై నేరారోపణలు రుజువు కావడంతో పైవిధంగా న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ కేసులో పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.రవి వాదనలు వినిపించారు.

అన్నదమ్ముల కొట్లాట

మెరకముడిదాం: మండలంలోని గరుగుబిల్లి గ్రామంలో ఇద్దరు అన్నదమ్ముల మధ్య నెలకొన్న భూతగాదాలు కొట్లాటకు దారి తీశాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పాదిలాపు వెంకటరమణ, సత్యం అన్నదమ్ములు. వారిద్దరి మధ్య 15 ఏళ్లుగా భూమి తగాదాలు ఉన్నాయి. అయితే ఇటీవల వర్షాలు పడడంతో వారి పొలాల్లో మంగళవారం దమ్ములు పట్టే క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగి కొట్లాటకు దారితీసింది. కొట్లాటలో గాయాల పాలైన నలుగురిని చీపురుపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న బుదరాయవలస ఎస్సై నవీన్‌పడాల్ గ్రామానికి చేరుకుని ఆరా తీశారు. అనంతరం పరస్పర ఫిర్యాదుల మేరకు నలుగురిపై కేసులు నమోదు చేశారు.

పరారైన రిమాండ్ ఖైదీకి జైలు శిక్ష

రాజాం సిటీ: స్థానిక బస్టాండ్‌లో పోలీసుల కళ్లుగప్పి పరారైన రిమాండ్ ఖైదీకి జైలు శిక్షతోపాటు జరిమానాను జూనియర్ సివిల్ జడ్జి విధించారని సీఐ కె.రవికుమార్ బుధవారం తెలిపారు. ఈ ఏడాది జనవరి 12న రిమాండ్ ఖైదీ పున్నాన రాంబాబును పాలకొండ సబ్ జైలు నుంచి తీసుకువెళ్లి ఎస్.కోట కోర్టులో హాజరుపరిచి తిరిగి పాలకొండ తీసుకువస్తుండగా రాజాం బస్టాండ్‌లో ఏఆర్ పోలీసుల కళ్లుకప్పి పరారైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అప్పట్లో ఎస్సై వై.రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి పట్టుకుని కోర్టులో హాజరుపర్చారు. ఈ మేరకు ఏపీపీ కిమిడి సూర్యకుమార్ వాదనలు వినిపించారు.

కొండగుడిలో ఆదివాసీ సంబరం

- సాలూరులో అంగరంగ వైభవంగా రాష్ట్ర స్థాయి ప్రపంచ ఆదివాసీ దినోత్సవం
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు
- సంబరాల్లో మమేకమైన వేలాదిమంది ఆదివాసీలు
- గిరిజనుల సంక్షేమానికి జగనన్న కృషి: డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర
- జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గిరిజనాభివృద్ధి: జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



గిరిజన నృత్యాలతో ప్రజాప్రతినిధులకు స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు

సాలూరు:

డప్పువాయిద్యాలు.. థింసా నృత్యాలు.. కొమ్ము, బిందెల డ్యాన్స్‌లు.. విచిత్ర వేషధారణలతో ఆదివాసీలు మురిపించి మైమరిపించారు. వేషభాషలతో ఆకట్టుకున్నారు. ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించేలా ప్రదర్శనలిచ్చారు. ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర అధ్యక్షతన, ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ ఆధ్వర్యంలో సాలూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో రాష్ట్రస్థాయిలో బుధవారం నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. కార్యక్రమానికి హాజరైన పీడిక రాజన్నదొరతో పాటు జిల్లా ఇన్‌చార్జి, ఐటీ, పారిశ్రామిక శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి తదితరులకు ఆదివాసీలు ఘన స్వాగతం పలికారు. సభాస్థలి వద్ద ముందుగా ఆదివాసీ జెండాను ప్రజాప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం జ్యోతిప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు, కొమరంభీం తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముందుగా ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ మాట్లాడుతూ, గిరిజన సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో 38,363 మంది గిరిజన రైతులకు 89,027 ఎకరాల పోడుపట్టాలను అందించినట్టు వెల్లడించారు. అర్హులైన గిరిజన రైతులందరికీ వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద ఏటా రూ.13,500 పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందజేస్తోందన్నారు. గిరిజన సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషిని వివరించారు.

- ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర మాట్లాడుతూ, ఆదివాసీయుల ఆచార సంప్రదాయాలు, గొప్పతనం ప్రపంచానికి తెలియజేయడమే ఉత్సవాల ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్రస్థాయి ఉత్సవాలు సాలూరులో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. నాడు దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి, నేడు ఆయన తనయుడు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిల పాలనలోనే గిరిజనులకు మేలు జరిగిందన్నారు. గిరిజనులకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలతో పాటు రాజ్యాంగపరమైన గిరిజన చట్టాలు పరిరక్షింపబడుతున్నాయని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. టీడీపీ పాలనలో గిరిజనులకు అన్ని విధాలా అన్యాయం జరిగిందన్నారు.
- జిల్లా ఇన్‌చార్జి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ... గిరిజనుల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో గిరిజన నియోజవర్గాల ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డికు అండగా నిలుస్తూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపిస్తుండడం సంతోషదాయకమన్నారు.
- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రాష్ట్రస్థాయి కార్యక్రమం నూతనంగా ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఏ ఎన్నికల్లోనైనా, ఎప్పుడైనా గిరిజన నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషిచేస్తున్న గిరిజనులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్వతీపురంను పార్వతీపురం మన్యంగా, అరకును అల్లూరి సీతారామరాజు జిల్లాలుగా నామకరణం చేసి మన్యం ప్రాంతానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక గుర్తింపు ఇచ్చారన్నారు. ఇటీవల కురుపాంలో జరిగిన జగనన్న అమ్మఒడి కార్యక్రమంలో కేజీబీవీ బాలిక అనర్గళంగా ఇంగ్లిష్‌లో మాట్లాడుతుంటే ముచ్చటేసిందన్నారు. ప్రభుత్వ విద్యను ప్రభుత్వం బలోపేతం చేస్తోందని తెలిపారు. గత టీడీపీ పాలనలో ఏ చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు వెళ్లే పరిస్థితి ఉండేదని, నేడు జగనన్న పాలనలో పార్వతీపురంలో వైద్యకళాశాల, మల్టీ సూపర్ స్పెషాలిటీ వైద్యశాలతో మెరుగైన వైద్యసేవలను చేరువ చేస్తున్నారన్నారు.
- జీసీసీ చైర్‌పర్సన్ శోభాస్వాతిరాణి మాట్లాడుతూ జీసీసీ ఉత్పత్తులను తిరుపతిలోని వేంకటేశ్వరస్వామి పూజలు, అభిషేకాలకు వినియోగిస్తున్నట్టు వెల్లడించారు. ఇది ఆదివాసీల ఘనతగా పేర్కొన్నారు. ఎంపీపీ బద్నాన ప్రమీల మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గిరిజనులకు న్యాయం, మేలు జరుగుతోందన్నారు. స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో గిరిజనురాలునైన నేను ఎంపీపీ అయినట్టు తెలిపారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీసీఎం రాజన్నదొర, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, తదితరులు



సాంస్కృతిక ప్రదర్శనలు

- గిరిజనసంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే, రాష్ట్ర గిరిజనసంక్షేమశాఖ సంచాలకులు జె.మురళి, ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు, ఎమ్మెల్సీ పి.రఘువర్మ తదితరులు మాట్లాడుతూ, గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు గిరిజనులను పాలకులు సత్కరించారు. కార్యక్రమంలో జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ గోవిందరావు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్టాల్స్

ఉత్సవాల్లో భాగంగా ఇంజినీరింగ్, జీసీసీ, ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ, హౌసింగ్, ఐసీడీఎస్, గిరివెలుగు, వైద్యారోగ్యశాఖ, విద్యాశాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను ప్రజాప్రతినిధులు సందర్శించారు. జీసీసీ స్టాల్‌లో అటవీఫలాల రుచిచూశారు. అరకు కాఫీని ఆస్వాదించారు. చివరిగా సుమారు 70 కోట్ల రూపాయలు విలువ చేసే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.



పూతికవలస ఆశ్రమ పాఠశాల బాలికలు



ప్రజలతో కిక్కిరిసిన సభాస్థలి

అధీకృత వ్యక్తులను నియమించాలి

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: రాజకీయ పార్టీలు అధీకృత వ్యక్తులను నియమించాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిషాంత్‌కుమార్ తెలిపారు. ఓటరు నమోదు పునశ్చరణ కార్యకలాపాలపై బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బూత్ స్థాయి అధికారి (బీఎల్‌ఓ) ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారని, బీఎల్‌ఓతో పాటు వెళ్లేందుకు రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు అధీకృత వ్యక్తులను నియమించాలని సూచించారు. ఈ నెల 21లోగా నియామక పత్రాలను అందించాలన్నారు. ఇప్పటివరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే నియమించిందని, మిగిలిన పార్టీలు త్వరగా నియమించాలని కోరారు. గత నెల 21 తేది నుంచి ప్రారంభమైన ఇంటింటి సర్వేలో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో 2,74,326 గృహాలలో 7,74,573 ఓటర్లకు గాను 1,15,555 గృహాల్లో 2,84,446 ఓటర్లను వెరిఫికేషన్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ ప్రక్రియ ఆగష్టు 21వ తేదీకల్లా పూర్తవుతుందని చెప్పారు. 10 మంది ఓటర్లు కంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న 3,727 గృహాలను గుర్తించగా ఇప్పటివరకు 3,032 గృహాల సర్వే పూర్తి చేశామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్ లెవిల్ ఏజెంట్ల ద్వారా క్లయిమ్‌లు, అభ్యంతరాల జాబితాలను పొంది పరిశీలన చేయవచ్చని స్పష్టం చేశారు. ఇంటి నంబర్ సున్న లేదా డాష్‌గా ఉన్న చోట్ల 63 వేల మంది ఓటర్లు ఉన్నట్లు గుర్తించామని, వారి వద్ద నుంచి ఫారం-8 తీసుకుంటున్నట్లు చెప్పారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత నుంచి కూడా దరఖాస్తులు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో భారత జనతా పార్టీ ప్రతినిధి ఎస్.అప్పారావు, బహుజన సమాజ్ పార్టీ ప్రతినిధి టి.వెంకట్, సీపీఎం ప్రతినిధి ఆర్.వేణు, వైఎస్సార్‌సీపీ ప్రతినిధి వి. శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రవి పాల్గొన్నారు.

ఘనంగా గిరిజన యూనివర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం



అతిథులను సత్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ కట్టిమణి

విజయనగరం అర్బన్: ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయ 5వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దాంతో పాటు ప్రపంచ ఆదివాసీ అంతర్జాతీయ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి సభాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా బరంపురం ఐఐఎస్ఈఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ అశోక్ కుమార్ గంగూలీ హాజరై ప్రారంభోపన్యాసం చేశారు. గిరిజన యూనివర్సిటీ ప్రపంచ స్థాయి సంస్థగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. దానికి టీమ్‌వర్క్ అవసరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన మైసూర్ ఎస్‌సీఈఆర్‌టీ రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ మురళి గాంధీ మాట్లాడుతూ కొత్త ఆవిష్కరణ గత జ్ఞాపకాల నుంచి లేదా పుస్తకాల నుండి పుట్టదని స్వేచ్ఛా మనస్సు నుంచి ఉత్సుకతతో నిండిన యువ మనస్సు నుంచి పుడుతుందని తెలిపారు. అనంతరం ప్రపంచ ఆదివాసీల అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వీసీ ప్రొఫెసర్ టీవీకట్టిమణి మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో యూనివర్సిటీ విజయాలు, వృద్ధి ప్రయాణం గురించి వివరించారు. డాక్టర్ ఎస్.రంగనాథన్ 131వ జయంతి సందర్భంగా లైబ్రేరియన్స్ డే ఉత్సవాలలో భాగంగా డిజిటల్ లైబ్రరీని ప్రారంభించారు. వర్సిటీ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా అతిథులను సత్కరించారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా చైర్మన్‌గా, డాక్టర్ గంగునాయుడు ఆర్గనైజింగ్ సెక్రటరీగా వ్యవహరించారు. యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బట్టల షోరూమ్స్‌లోచీరల దొంగతనం

- సీసీ ఫుటేజీ ఆధారంగా వెలుగులోకి



సీసీ టీవీ ఫుటేజీలో రికార్డైన మహిళలు

రాజాం సిటీ: బట్టల షోరూమ్స్‌లో కొంతమంది మహిళలు చీరలు అపహరించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రాజాం పట్టణంలోని శ్రీకాకుళం రోడ్డు, పాలకొండ రోడ్డులోని షోరూమ్స్‌లో జరిగిన జరిగిన ఈ ఘటనలపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఈ నెల 4న కొంతమంది మహిళలు శ్రీకాకుళం రోడ్డులోని జేకే షాపింగ్‌మాల్‌లో చీరలు కొనడానికి వెళ్లి తమకు నచ్చిన చీరలను చూపించాలని కోరడంతో సిబ్బంది చూపిస్తుండగా వారి కళ్లుగప్పి 11 చీరలు అపహరించుకుపోయారు. ఈ విషయమై బుధవారం స్టాకు సరిచూసుకుంటుండగా చీరలు తక్కువ రావడంతో అనుమానం వచ్చి సీసీ ఫుటేజీని షాపింగ్ మాల్ సిబ్బంది పరిశీలించారు. సుమారు రూ. 30వేల విలువైన చీరలు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. అలాగే అదే రోజు పాలకొండ రోడ్డులోని మరో షోరూమ్‌కు వెళ్లి అక్కడ కూడా ఇదే తరహాలో 11 చీరలను మహిళలు దొంగతనం చేసి పట్టుకుపోయారు. అయితే కొంత దూరం వెళ్లాక ఒక దుకాణ యజమానికి ఫోన్ చేసి మీ షాపులో చీరలు దొంగతనం చేశామని, వాటిలో 9 చీరలు ఫలానా చోట పెట్టామని చెప్పినట్లు తెలిసింది. దీంతో ఉలిక్కిపడిన షోరూమ్ సిబ్బంది హుటాహుటిన సీసీ ఫుటేజీలను పరిశీలించి మహిళలు చీరలు దొంగతనం చేసినట్లు గుర్తించారు. మరో దుకాణంలోని 11 చీరలతోపాటు ఈ రెండు చీరలను ఆ మహిళలు పట్టుకుపోయారు. రెండో షాపులో చీరలు ఎందుకు దొంగతనం చేశారో మళ్లీ ఎందుకు దూరంగా విడిచిపెట్టారోనని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. జేకే షాపింగ్‌మాల్‌లో చీరల దొంగతనంపై క్యాషియర్ పురోహిత అజిత్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వై.రవికిరణ్ తెలిపారు.

యువతిపై అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్



నిందితుడు నతీఫ్

విజయనగరం క్రైమ్: యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి టూటౌన్ ఎస్సై షేక్ శంకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గౌడవీధికి చెందిన నతీఫ్ గురజాడ అప్పారావు రోడ్డులో మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న యువతిని అనుసరిస్తూ వెళ్లాడు. నిర్మానుష్య ప్రాంతంలో ఒంటరిగా వెళ్తున్న ఆ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. యువతి గట్టిగా కేకలు వేసి ప్రతిఘటించడంతో పారిపోయాడు. బాధిత యువతి పారిపోతున్న యువకుడిని అనుసరించి దిశ ఎస్ఓఎస్‌కి కాల్ చేసి సమాచారమందించింది. కేవలం మూడు నిమిషాల వ్యవధిలో టవర్ లొకేషన్ ఆధారంగా సంఘటనా స్థలానికి దిశ పోలీసులు చేరుకున్నారు. యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నతీఫ్‌ను టవర్ లొకేషన్ ఆధారంగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు నతీఫ్‌పై టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేసి అరెస్ట్ చేశారు. సమయస్ఫూర్తితో వ్యవహరించిన యువతిని పోలీసులు అభినందించారు.

సౌకర్యాల వెం'బడి చదువులు'

- విజయనగరం జిల్లాలో 1,578 స్కూళ్లలో నాడు నేడు పనులు
- రూ.230.99 కోట్లతో రెండో విడత
- 734 స్కూళ్లతో పాటు అంగన్‌వాడీ కేంద్రాలు
- హెచ్‌ఎంలు, పేరెంట్స్ కమిటీలకే పనుల పర్యవేక్షణ బాధ్యత



అదనపు తరగతి గదులతో రాజాం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సరిపడా లేని తరగతి గదులు, పెచ్చులూడుతున్న పైకప్పు, చెట్ల కింద చదువులు ఇదీ ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల దుస్థితి. ప్రభుత్వ పాఠశాల అంటేనే అందరూ చిన్నచూపు చేసేవారు. అయితే వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి పూర్తిగా మారిపోయింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.

– విజయనగరం అర్బన్

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను రూపుదిద్దాలని మదిలో మెదిలిన ఆలోచనతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుకు అడుగులు వేశారు. ఈ మేరకు రంగురంగుల తరగతి గదులు, స్మార్ట్‌టీవీలతో బోధన, విద్యార్థులకు సరిపడా ఫర్నిచర్, విద్యుత్ సౌకర్యం, రన్నింగ్ వాటర్‌తో మరుగుదొడ్లు, ప్రహరీలు, శుద్ధజలం, గ్రీన్‌చాక్‌బోర్డు, ఇంగ్లీష్‌ల్యాబ్స్‌తో ప్రభుత్వ పాఠశాలలు ఇప్పుడు కళకళలాడుతున్నాయి. మొదటి విడత మనబడి నాడు నేడు పనుల్లో చేపట్టిన మౌలిక వసతులతో సరిపెట్టకుండా రెండో విడత నాడు నేడులో అదనపు తరగతి గదులు, వంటగదులు, ప్రహరీల నిర్మాణం చేపట్టారు.

రాజాంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 800మందికి పైగా విద్యార్థుల నమోదు ఉంది. గత ఏడాది వరకు తరగతి గదులు సరిపడక పాఠశాల ప్రాంగణంలో ఆరుబయట పాఠాలు వినాల్సి వచ్చేది. మన బడి నాడు నేడు రెండో విడత అభివృద్ధి పనుల్లో భాగంగా అదనపుతరగతి గదులు కావాలని ప్రతిపాదించారు. దీనికి ప్రభుత్వం స్పందించి రూ.2.5 కోట్లతో 20 అదనపు తరగతులు మంజూరు చేసింది. పాఠశాల ప్రాంగణంలో 20 గదులకు సరిపడా స్థలం లేకపోవడంతో 10 అదనపు తరగతి గదుల నిర్మాణం చేపట్టారు. మరికొద్ది రోజుల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉంటాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పొంద్రంగి నాగయ్య తెలిపారు.



రెండో విడత నాడు నేడు నిర్మాణంలో ఉన్న మొదటి అంతస్తులోని అదనపు తరగతి గదులు



మొదటి విడత నాడు నేడు పూర్తయిన పనుల్లో భోగాపురం మండలం ముంజేరు ప్రాథమిక పాఠశాలలో తాగునీటి సౌకర్యం

జిల్లాలో నాడు నేడు అభివృద్ధి పనులు

మౌలిక సదుపాయాలను పెంచడమే లక్ష్యంగా రూపొందించిన మన బడి నాడు నేడు పథకం ద్వారా జిల్లాలో మొదటి, రెండు విడతల్లో రూ. 414.35 కోట్లతో 1,578 స్కూళ్లలో ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టారు. ఇంతవరకు మొదటి నాడు నేడు పనుల్లో భాగంగా 841 స్కూళ్లకు రూ.185.02 కోట్లు మంజూరు చేసి ప్రధానమైన 9 అంశాలను కల్పిస్తూ అభివృద్ధి పనులను పూర్తి చేశారు. అలాగే గత ఏడాది 738 పాఠశాలల్లో ప్రారంభమైన రెండో విడత మన బడి నాడు నేడులో భాగంగా 3,465 అభివృద్ధి పనులు రూ.230.99 కోట్లతో మరికొద్ది రోజుల్లో పూర్తి కానున్నాయి. రెండో విడత నాడు నేడు పనుల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, ఫర్నిచర్, గ్రీన్‌చాక్‌బోర్డు, కిచెన్ షెడ్లు ఉన్నాయి. ఫౌండేషన్ స్కూళ్లలో కలిపిన అంగన్ వాడీ కేంద్రాల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి వాటిలో 236 అభివృద్ధి పనుల కోసం రూ. 8.03 కోట్ల నిధులు కేటాయించారు.

షెడ్యూల్ ప్రకారం రెండో విడత పనుల పూర్తి

జిల్లా వ్యాప్తంగా 738 ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన రెండో విడత నాడు – నేడు పనులను షెడ్యూల్ ప్రకారం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాం. ఇందుకోసం జిల్లా స్థాయిలో అధికారుల బృందాన్ని ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం. నాణ్యతలో ఎలాంటి ఆరోపణలకు తావులేకుండా అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నాం.

– బి.లింగేశ్వరరెడ్డి, డీఈఓ

ఐదు ఇంజినీరింగ్ విభాగాలకు నిర్మాణ బాధ్యతలు

కార్పొరేట్‌కు దీటుగా పాఠశాలలను తీర్చిదిద్దాలనే సంకల్పంతో చేపట్టిన నాడు నేడు పనుల పూర్తికి ఐదు ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్లను బాధ్యులను చేశారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్ (పీఆర్), సమగ్ర శిక్ష ఇంజినీరింగ్, పబ్లిక్, హెల్త్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ), రూరల్ వాటర్ సర్వీస్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ (ఆర్‌డబ్ల్యూఎస్) నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నాయి.